ప్రగతిలో భళా.. గుమ్మిరేవుల



గుమ్మిరేవులలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్



గుమ్మిరేవుల పంచాయతీలో గ్రామ సచివాలయం భవనం

- స్మార్ట్ విలేజ్‌గా ఎంపికైన పంచాయతీ
- 135 గ్రామాలకు దారి చూపిన ప్రధాన రహదారి
- నాడు అధోగతి..నేడు పురోగతి

సీలేరు: ఉమ్మడి విశాఖ జిల్లా ఉన్నపుడు అత్యంత మారుమూల అటవీ ప్రాంతం గుమ్మిరేవుల పంచాయతీ. ఐదేళ్ల క్రితం వరకు ఆ ప్రాంతం మావోయిస్టులకు అడ్డా... ఎక్కడ చూసిన గంజాయి వనాలే..కనీసం పంచాయతీ కార్యాలయం కూడా లేని ప్రాంతమది..గిరిజన జాతికి కీలకమైన భగత, వాల్మికీ, తెగలకు నిలయమైన గ్రామమిది.70 ఏళ్ల చరిత్ర కలిగిన గుమ్మిరేవుల పంచాయతీలో మావోయిస్టుల నల్లజెండాలు తప్ప జాతీయజెండా ఎగురడమంటే ఏమిటో తెలియని ప్రాంతం. అక్కడ ఎన్నికలు నిర్వహించాలంటే జిల్లా యంత్రాంగానికి సవాల్‌గా ఉండేది.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పంచాయతీలో కనీసం ఒక్క అభివృద్ధి పని జరగలేదు. పంచాయతీలో పరిధిలోని ఏ గ్రామంలోనూ మౌలిక సదుపాయాలు ఉండేవి కావు.. చంద్రబాబు పాలనలో రహదారులు, రవాణా సౌకర్యాలు లేక ఆయా ప్రాంత గిరిజనులు నానా అవస్థలు పడేవారు..ఎక్కడికైనా కాలినడకే శరణ్యంగా ఉండేది.. తాగునీటి సదుపాయం లేక గెడ్డలను ఆశ్రయించి కలుషిత నీటితో గ్రామస్తులు రోగాల బారిన పడేవారు.. వర్షాల వల్ల పంచాయతీలో ఉధృతంగా వాగు ప్రవహిస్తే ఆ సమయంలో ఏ కష్టమొచ్చినా ప్రాణాలు వదులుకోవాల్సిన పరిస్థితి.. ఎన్నో సందర్భాల్లో చేతిలో ప్రాణాలు పోయిన పరిస్థితి...అదంతా గతం...వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీ రూపురేఖలు మారిపోయాయి. పంచాయతీ పరిధిలోని గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో పరగులు తీస్తున్నాయి. విశాలమైన రహదారులు..మెరుగైన రవాణా సౌకర్యంతో రైతులు వ్యవసాయ అటవీ ఉత్పత్తులను వేర్వేరు ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు.



వాటర్ ట్యాంకు

ఒకే ఒక్క రోడ్డు... 135 గ్రామాల అభివృద్ధి

గుమ్మిరేవుల పంచాయతీ ధారకొండ నుంచి గుమ్మిరేవుల వరకు ఉన్న 21 కిలోమీటర్ల రహదారి అభివృద్ధితో నేడు ఆ పంచాయతీ రూపురేఖలు మారాయి. అక్కడ నివసిస్తున్న గిరిజనులు ఆనందంగా నేడు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పంచాయతీ ప్రధాన రహదారి అందుబాటులోకి వచ్చింది. 21 కిలోమీటర్లకు రూ.14 కోట్లు ప్రభుత్వం వెచ్చించడంతో ఆరోడ్డు నేడు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. దీంతో 132 గ్రామాలు ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నాయి.

అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కలలు కన్న స్మార్ట్ విలేజ్‌గా గుమ్మిరేవుల పంచాయతీ ఆదర్శంగా నిలిచింది.

- ధారకొండ నుంచి గుమ్మిరేవుల వరకు 21 కిలోమీటర్లకు రూ.14కోట్లతో తొలుత తారురోడ్డు నిర్మించారు.
- కొంగపాకల వంతెనను రూ.60 లక్షలతో నిర్మించారు.
- మాదిగమల్లు వంతెన రూ.2 కోట్లతో నిర్మించారు.
- రూ.40 లక్షలతో సచివాలయ భవనం
- రూ.22 లక్షలతో విలేజ్ క్లినిక్ నిర్మాణం జరిగింది.
- రూ.9.2లక్షతో చెత్త సంపద కేంద్రం అందుబాటులో వచ్చింది.
- రూ.23లక్షలతో వాటర్ ట్యాంకును నిర్మించారు.
- రూ.1.27కోట్లతో ఇంటింటికీ కుళాయి పనులు జరుగుతున్నాయి.
- రూ.20 లక్షలతో 420 మీటర్లు సీసీ రోడ్డు నిర్మించారు.
- రూ.21.8 లక్షలతో ఆర్‌బీకే భవనాన్ని నిర్మించారు.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.10లక్షలతో సువిశాల భవనాన్ని నిర్మించి అందుబాటులో తీసుకొచ్చారు.
- చింతగుప్ప గ్రామంలో 1.5 కిలోమీటర్లు రూ.90లక్షలతో పంచాయతీరాజ్ శాఖ నిధులతో బీటీ రోడ్డును నిర్మించారు.
- కమ్మరితోట నుంచి చీడిగుంట వరకు కిలోమీటర్ రహదారికి రూ.40లక్షలు వెచ్చించారు.
- గుమ్మిరేవు నుంచి తోకరాయి వరకు రూ.42లక్షలతో రహదారి నిర్మించారు. దీంతో దశాబ్దాల తరబడి రవాణాకు నోచుకోని అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి.
- ప్రతి రోజూ నర్సీపట్నం నుంచి గుమ్మిరేవుల పంచాయతీకి బస్సు నడుస్తోంది.
- అయిదు సెల్‌టవర్ల నిర్మాణంలో ఉన్నాయి. పంచాయతీ 19 గ్రామాల్లో 2500 జనాభా, 545 గడపలు, 3288 ఎకరాల సాగుభూమి సాగులోకి వచ్చింది.

శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి



ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి పథకాన్ని మారుమూల గ్రామాలకు చేరవేస్తున్నాం. అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధే లక్ష్యంగా పనులు చేస్తున్నాం. గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రతీ గిరిజనుడికి సచివాలయ సేవలు ద్వారా ఎన్నో పథకాలను ఇంటి వద్దకు చేరుస్తున్నాం. మరింత అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నాం.

– శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, గుమ్మిరేవుల

జగనన్నకు రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి దూరమైన గ్రామస్తులంతా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక మా గుమ్మిరేవుల పంచాయతీలో పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగింది. ఎన్నో భవనాలు నిర్మించారు. గతంలో మండల కేంద్రానికి వెళ్లాలంటే ఎన్నో కష్టాలు పడేవాళ్లం. అలాంటిది మా ఊళ్లోనే సచివాలయం నిర్మించి అన్ని సేవలు ఇక్కడే అందజేస్తున్నారు. ఆర్టీసీ బస్సు సదుపాయం రావడం ఆనందంగా ఉంది. మా ప్రాంతాన్ని అభివృద్ధిని చేసిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– కమలమ్మ, సర్పంచ్, గుమ్మిరేవుల



సచివాలయంలో గిరిజనులకు సేవలందిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

28న మండల సమావేశం

ఎటపాక: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో ఉదయం 10.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

భక్తులకు అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ, చైర్మన్ అప్పలరాం, ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్‌ల ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానంలో సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో విద్యుత్ వెలుగులు



జగ్గంగరువులో విద్యుత్ స్తంభాలు వేస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని గిరిజన మారుమూల గ్రామాల్లో సైతం విద్యుత్ సౌకర్యం కలిపిస్తున్నట్టు మండల విద్యుత్ శాఖాధికారి రమణ తెలిపారు. మండలంలోని తీగలవలస పంచాయతీ పీవీటీజీ గ్రామాలైన జగ్గంగరువు, మర్రివలస, కామేలుగొంది, ఆముదు గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటుచేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న మారుమూల గిరిజన గ్రామాలను గుర్తించి విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు.

పేరుకుపోయిన చెత్తతో అవస్థలు



జెడ్పీకాలనీ ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని జెడ్పీ కాలనీ జంక్షన్‌లో గత కొద్దిరోజులుగా చెత్త చెదారాలు పేరుకుపోయి ఉన్నాయి. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేక అరకులోయ పట్టణంలో వివిధ ప్రధాన కూడళ్ల అధ్వానంగా మారాయి. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో చెత్తాచెదారాలతో దుర్గంధం వెదజల్లుతోందని, చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. దోమలు, ఈగల బెడద మరింత ఎక్కువైందని, రోగాలు ప్రబలే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలోని గత కొద్ది రోజులుగా పేరుకుపోయిన చెత్తను తొలగించాలని వారు కోరుతున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

మాడుగుల రూరల్: అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు ఆ పనుల్లో బిజీగా ఉన్నారు. చెరకు దవ్వనాట్లు వేస్తున్నారు. ఖరీఫ్ వరి నారుమడులు సిద్ధం చేస్తున్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



జడ్డంగి పీహెచ్‌సీలో జరుగుతున్న సెక్టార్ మీటింగ్‌కు హాజరైన సిబ్బంది

రాజవొమ్మంగి: గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని జడ్డంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రిలో శనివారం సెక్టార్ సమావేశం జరిగింది. ఆయన ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు ఇతర సిబ్బందితో మాట్లాడారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. వారికి వెంటనే అన్ని రకాల పరీక్షలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా వారికి ఉచితంగా అందజేస్తున్న అన్ని సేవలను వివరించాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వంటి తదితర సీజనల్ వ్యాధులపై సిబ్బందికి అవగాహన కల్పించడంతో పాటు రోగి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 18 సంవత్సరాలు నిండిన వారికి బీసీజీ వ్యాక్సిన్ వేయాలన్నారు. ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మణరావు, ఎస్‌యూఓ ప్రసాద్, హెచ్‌వీ రమణ, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్లు

అరకులోయ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం అవరణలో రెండు భారీ సిల్వర్‌ఓక్ చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు ఏ సమయంలో చెట్లు కూలీ పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తు తం తరచూ ఈదురుగాలులతో వర్షాలు కురుస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. అధికారులు స్పందించి ఎండిన చెట్లు తొలగించాలని వారు కోరుతున్నారు.

పాఠశాలలు తెరిచే నాటికే పుస్తకాలు



సబ్బవరం ఎంపీపీ స్కూల్‌లో విద్యాకానుక పుస్తకాలను పరిశీలిస్తున్న వెంకటలక్ష్మమ్మ



సబ్బవరంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ తదితరులు

అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ

సబ్బవరం: పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ చెప్పారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. పాఠశాలకు చేరిన విద్యాకానుక పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఆధునికీకరణ పనులను పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.పాఠశాల ఆవరణలోని మండల శాఖా గ్రంథాలయాన్ని,అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి, గ్రంథాలయ అధికారి వి. శిరీషతో పాటు ఎంఆర్‌సీ సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

సంతలో జేబు దొంగలు హల్‌చల్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో జేబు దొంగలు హల్‌చల్ చేశారు. పలువురి పర్సులు దొంగతనం చేశారు. దీంతో సంతకు వచ్చిన గిరిజనులంతా అప్రమత్తమయ్యారు. సంతబయలు సమీపంలో పర్సును దొంగతనం చేసేందుకు ఇద్దరు మహిళలు ప్రయత్నిస్తుండగా ఎంతో చాకచక్యంగా పట్టుకొని, స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. సంతలో జరుగుతున్న దొంగతనాలపై ఎస్ఐ రవీంద్రకు తెలియజేశారు. దీంతో ఎస్ఐ రవీంద్ర విచారించగా వారిలో ఒకరు అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన రేఖ, మరోకరు పశ్చి గోదావరి జిల్లా ముప్తపాడు గ్రామానికి చెందిన ఈశ్వరిగా తెలిపారు. గత కొన్ని నెలలుగా వారపు సంతలో పర్సులు పోతుండడం ఎట్టకేలకు దొంగలు దొరకడంతో సంతకు వచ్చేవారంతా ఊపిరి పీల్చుకున్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

చింతపల్లిరూరల్: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. ఖరీఫ్ సిజన్ సందర్భంగా రైతులకు పచ్చిరొట్ట విత్తనలైన పిల్లిపెసర, జనుము, జీలుగ, వాటితో పాటు వేరుశనగ విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. లంబసింగి, తాజంగి, చింతపల్లి, చిన్నగెడ్డ, అంతర్ల, కొత్తపాలెం1,2, చౌడుపల్లి రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ మేరకు లంబసింగి ఆర్‌బీకే వద్ద రైతులకు వ్యవసాయ సహాయక సంచాలకులు కె.జాహ్నవి విత్తనాలు పంపిణీ చేశారు.



లంబసింగి ఆర్‌బీకే వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సహాయక సంచాలకులు జాహ్నవి

ప్రకృతి సోయగం



ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో ఎటు చూసినా ప్రకృతి అందాలు దర్శనమిస్తాయి...కొండకోనల్లో పచ్చని పైరులు, అందమైన జలపాతాలతో కనువిందుచేస్తాయి... పద్మాపురంలోని ప్రధాన దారికి ఇరువైపులా పచ్చనిచెట్లు.. పసుపు రంగుల పువ్వులతో స్వాగతం పలుకుతున్నాయి.. పచ్చని పందిరితో ఆహ్వానిస్తున్న ఈ మనోహర దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటుంది.

– అరకులోయ రూరల్

జంపెన వాసవీమాత ఆలయంలో హుండీ చోరీ

మాడుగుల రూరల్ : మండలంలో జంపెన గ్రామంలో గల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి హుండీ చోరీకి గురైంది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాను తెరిచారు. బీరువాలో వున్న చీరలు చిందర వందరగా పడవేసారు. ఆలయంలో గల హుండీని పగులగొట్టి అందులోని సుమారు రూ. 25000 నగదును తస్కరించారు. ఈ హుండీని తీసుకెళ్లి సమీపంలో గల పొలాల్లో పడేశారు. శనివారం ఉదయం గ్రామంలో గల వాసవీ క్లబ్ సభ్యులు ఆలయానికి వెళ్లినపుడు గుడి తలుపులు తీసి ఉండడాన్ని గమనించి వెంటనే ఆలయ కమిటీవారికి సమాచారం అందించారు. కమిటీ వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శనివారం వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల మండలంలో పలు గ్రామాల్లో గ్రామ దేవతల హుండీలు చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి. కాగా తాజాగా వాసవీమాత ఆలయంలో ఈ నెల 18న వాసవీమాత జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీలో దాతలు వేసిన నగదు చోరీకి గురికావడం పట్ల వాసవీక్లబ్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.



దుండగులు పగులగొట్టిన ఆలయంలోని బీరువా



చోరీకి గురైన హుండీ

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం వృద్ధి

చీడికాడ: పచ్చిరొట్ట విత్తనాలు వేయడం వల్ల భూసారం వృద్ధి చెందుతుందని మండల వ్యవసాయాధికారి కె.రమాదేవి తెలిపారు. దుక్కు దున్నిన పొలంలో నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, జనుమలలో ఏదో ఒక దానిని జల్లుకోవాలని రైతులకు సూచించారు. మండలంలో జీలుగు విత్తనాలు 15.80 క్వింటాళ్లు, జనుము 2.20 క్వింటాళ్లు, పిల్లి పెసర విత్తనాలు 1.54 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.

అరటి సాగులో మెలకువలపై అవగాహన

అరటి గెలలకు కవర్ కట్టడంపై రైతులకు సూచనలు

రావికమతం: అరటి సాగులో మెలకువలపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు మేడివాడ రైతులకు శనివారం అవగాహన కల్పించారు. గ్రామీణ వ్యవసాయంలో మెలకువలు, యాంత్రీకరణ పద్ధతులను రైతులకు వివరించే కార్యక్రమంలో భాగంగా మేడివాడ గ్రామానికి చెందిన గొర్లె కృష్ణ,గంటా నాయుడు అరటి తోటలను వారు పరిశీలించారు. గెలలకు కవర్ కట్టే విధానాన్ని వివరించారు. కవర్ కట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీసీ రాజ్‌కుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



మేడివాడలో రైతులకు అరటి గెలలకు కవర్ కట్టడం గురించి వివరిస్తున్న విద్యార్థులు

పర్తియాత్రకు సత్యసాయి భక్తులు తరలిరావాలి



పెదనందిపల్లిలో సత్యసాయి బాబా చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

దేవరాపల్లి: పుట్టపర్తిలో అక్టోబర్‌లో జరిగే పర్తియాత్రకు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా సత్యసాయి భక్తులు తరలిరావాలని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు కోరారు. మండలంలోని పెదనందిపల్లిలో శనివారం సత్యసాయి సేవా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పుట్టపర్తిలో ఏటా మాదిరిగా అక్టోబర్ 23 నుంచి 25 వరకు పర్తి యాత్ర ఘనంగా జరుగుతుందన్నారు. ఈ యాత్రకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. ఎప్పటి మాదిరిగా ఆధ్యాత్మిక సమావేశాలు, భజనలు, బాల వికాస్ తరగతులు యథావిధిగా కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో దేవరాపల్లి మండల సత్య సాయి సేవా సమితి నూతన అధ్యక్షుడిగా ఆదిరెడ్డి చినకన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాడు అప్పారావు, గంధం సూర్యం, రమామణి, సీహెచ్‌వి. రవిశంకర్, జగన్నాథం, భక్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో మేధోశక్తి పెరుగుదల

అచ్యుతాపురం : విద్యార్థులు తెల్లవారు జామున 5 గంటలకు నిద్ర లేచి ధ్యానం పాటిస్తే మేధాశక్తి పెరుగుతుందని ఉపాధ్యాయులు అప్పారావు అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా రోజుకొక అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ధ్యానం ప్రాధాన్యం, ఆవశ్యకత, ఉపయోగాల గురించి అప్పారావు వివరించారు. ధ్యానం చేయడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. తద్వారా సానుకూల ఆలోచనలు ఏర్పడతాయని తెలిపారు. యోగసనాలు కూడా వేయాలని సూచించారు. అవగాహన కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థులకు లైబ్రేరియన్ మిఠాయిలు అందజేశారు.